కార్పొరేషన్ ఆదాయానికి టెండర్

- ఆశీలు వసూలులో ఉదాసీనత
- కార్పొరేషన్ ఆదాయాన్ని కాంట్రాక్టర్లకు దోచిపెడుతున్న రెవెన్యూ అధికారులు
- చెక్కులను సకాలంలో చెల్లించని కాంట్రాక్టర్లు
- కాలయాపన చేసి తీరిగ్గా టెండర్ రద్దు చేసిన అధికారులు



గత నెలలో సంద్రీస్ మార్కెట్‌లో చెత్త తరలించడం లేదనే ఫిర్యాదుపై పర్యటిస్తున్న నగర మేయర్ రవీంద్ర (ఫైల్)

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ రెవెన్యూ అధికారులు ఆశీలు వసూలు టెండర్ ప్రక్రియలో కాంట్రాక్టర్లకు మేలు జరిగేలా ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. అధికారుల అలసత్వం వల్ల నగరపాలక సంస్థ ఆదాయానికి గండి పడుతోంది. నిబంధనలకు పాతర నగర పరిధిలోని రెండు మార్కెట్లలో ఆశీలు వసూలు చేసే హక్కు కోసం ఏప్రిల్ 1, 2025న టెండర్లు పిలిచారు. అయితే, కాంట్రాక్టర్లు ధరావత్తు డీడీతో పాటు సాల్వెన్సీ సర్టిఫికెట్ సమర్పించాలి. టెండర్ దక్కించుకుంటే పాట పాడుకున్న మొత్తంలో 1/4వ వంతు నగదు చెల్లించాలి. ఆ తరువాత పోస్ట్ డేటెడ్‌తో చెక్కులు సమర్పించాలి. మున్సిపల్ అధికారులు మూడు నెలకొకసారి వాటిని బ్యాంక్‌లో వేసి మొత్తాన్ని నగరపాలక సంస్థకు జమ చేయాలి. పాట పాడిన మొత్తంలో 1/4వ వంతు బ్యాంక్ గ్యారెంటీ తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇవేవి నిబంధనలు ప్రకారం జరగడం లేదు. దీంతో కొంతమంది పాట పాడుకున్న కాంట్రాక్టర్లు వారు అనుకున్న లక్ష్యం అధిగమించిన తరువాత నిబంధనలు అతిక్రమిస్తున్నారు. టెండర్ రద్దు అయ్యే విధంగా పావులు కదుపుతున్నారు. ఇందులో రెవెన్యూ అధికారుల పాత్ర ఉందని చెప్పడంలో సందేహం లేదు.

తాజాగా సంద్రీస్ మార్కెట్ టెండర్ రద్దు

గుంటూరు నగరపాలక సంస్థ ఎదురుగా ఉన్న సంద్రీస్ మార్కెట్‌లో చెత్త అస్కారం కలిగిన పండ్లు దిగుమతి చేసే వారి నుంచి ఆశీలు వసూలు చేసే హక్కును ఓ వ్యక్తి హెచ్చుగా పాడి రూ.8,37,800కు (జీఎస్టీతో కలిపి)టెండర్ దక్కించుకున్నారు. అయితే,అతను మార్కెట్ వరకు మాత్రమే కాకుండా నగరమంతా వసూలు చేయడంపై పలు ఫిర్యాదులు అందాయి. చెత్తను తరలించడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఈ నెల 4న టెండర్ రద్దు చేస్తూ కమిషనర్ పులి శ్రీనివాసులు ఉత్తర్వులు జారీ చేశారు.

తెలివిగా తప్పించుకున్న కాంట్రాక్టర్

ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఎండా కాలం సీజన్‌లో పండ్లు వ్యాపారం నగరంలో జోరుగా సాగుతుంది. సంద్రీస్ మార్కెట్ వరకు మాత్రమే ఆశీలు వసూలు చేయాలని నిబంధనలు ఉన్నప్పటికీ కాంట్రాక్టర్ నగరం అంతా రోజుకు రూ.10వేలు నుంచి రూ.20వేలు దాకా వసూలు చేసుకుని జేబులు నింపుకున్నాడు. చెత్తను కూడా కార్పొరేషన్ పారిశుద్ధ్య కార్మికుల ద్వారా తరలించే వాడు. దీనిపై కార్మికుల నుంచి ఫిర్యాదులు రావడంతో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, మేయర్ రవీంద్ర స్వయంగా మార్కెట్‌లో చెత్త తరలింపు విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కాంట్రాక్టర్ వాటిని పట్టించుకోక పోవడంతో టెండర్‌ను జూన్ 4న రద్దు చేశారు. కాంట్రాక్టర్ 65 రోజుల పాటు నగరం అంతా ఆశీలు వసూలు చేసుకుని జేబులు నింపుకున్నాడు. ప్రతి రోజు మార్కెట్‌లో చెత్త తరలించకపోవడంతో కార్పొరేషన్‌కు నెలకు రూ.6లక్షలు దాకా నష్టం వాటిల్లందనే చెప్పుకోవచ్చు. టెండర్ రద్దు కావడంతో కాంట్రాక్టర్ వద్ద నుంచి ముందుగా తీసుకున్న చెక్కులను రెవెన్యూ అధికారులు తిరిగి ఇచ్చేసినట్లు సమాచారం.

మరీ ఇంత నిర్లక్ష్యమా ?

టెండర్ రద్దుపై ఇచ్చే నోటీసుల్లో కూడా రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కొల్లి శారదా మార్కెట్ టెండర్ రద్దుకు సంబంధించిన నోటీసులో పేర్కొన్న బకాయిలు రూ.19,17,505లక్షలను..సంద్రీస్ మార్కెట్ టెండర్ రద్దు నోటీసులో కూడా చూపించారు. సంద్రీస్ మార్కెట్‌లో ఇచ్చిన రద్దు నోటీసులో రూ.8,37,800 చూపించాల్సి ఉండగా కొల్లి శారదా మార్కెట్‌కు రద్దులో చూపిన విధంగా.19,17,505లక్షలు చూపించారు. దీనిపై అధికారులు కూడా సంతకాలు చేశారు. దీనిని బట్టి రెవెన్యూ అధికారులు ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో అర్థం అవుతోంది.

కొల్లి శారద మార్కెట్ టెండర్ రద్దు వెనుక మతలబు

కొల్లి శారద మార్కెట్‌లో ఆశీలు వసూలు చేసుకునేందుకు గాను రెవెన్యూ అధికారులు మార్చి 25న బహిరంగ వేలం కం టెండర్ నిర్వహించారు. ఇందులో ఓ వ్యక్తి హెచ్చుగా పాట పాడటంతో అతనికి ఆశీలు వసూలు చేసుకునే హక్కు ఏప్రిల్ 1, 2025 నుంచి మార్చి, 31, 2026 వరకు కల్పించారు. ఇందుకు గాను సదరు వ్యక్తి రూ. 65,00,016, జీఎస్టీ 18శాతం రూ.11,70,003 కలిపి రూ.76,70,019ను లీజుకు కింద నాలుగు వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. మొదటి వాయిదా కింద రూ.19,17,505ను టెండర్ దక్కించుకున్న వారం రోజుల్లో చెల్లించాల్సి ఉంది. అయితే, కాంట్రాక్టర్ దాన్ని చెల్లించలేదు. ముందుగా బహిరంగ వేలంలో పాల్గొనాలంటే రూ.5లక్షలు ధరావత్తు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, నగరపాలక సంస్థ అధికారులు ఇక్కడే నగరపాలక సంస్థ అధికారులు కాంట్రాక్టర్‌కు మేలు చేశారు. ధరావత్తు కింద రూ. 5లక్షలతో పాటు మరో రూ. 5 లక్షలు డీడీ రూపంలో చెల్లించాడని, మిగిలిన రూ. 9,17,505 లక్షలు చెల్లించని కారణంగా మార్కెట్‌లో రుసుము(ఆశీలు) వసూలు చేసుకునే హక్కును రద్దు చేస్తూ గత రోల 16న ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనలు ప్రకారం కాంట్రాక్టర్ నుంచి ఏడు రోజుల్లో మొదటి వాయిదా వసూలు చేయకుండా 50 రోజుల తరువాత రెవెన్యూ అధికారులు కళ్లు తెరిచి టెండర్ రద్దు చేయడం గమనార్హం.


కొల్లి శారద మార్కెట్

సుమారు 50 రోజులు పాటు రోజుకు రూ.25 నుంచి రూ. 30వేలు దాకా కాంట్రాక్టర్ ఆశీలు వసూలు చేసుకున్నాడు. రూ. 5లక్షల దాకా కాంట్రాక్టర్‌కు రెవెన్యూ అధికారులు ఆదాయం చేకూర్చారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

గుంటూరు లీగల్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని గుంటూరు రెండవ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎండీ. ఇష్రత్ ఫాతిమా తెలిపారు. క్యాలెండరు యాక్టివిటీస్‌లో భాగంగా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి ఆదేశాల మేరకు గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బాల కార్మిక వ్యతిరేక మాసం వాల్ పోస్టర్‌ను న్యాయమూర్తి ఇష్రత్ ఫాతిమా ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని గుర్తించాలని తెలిపారు. లేబర్ ఆఫ్ డెప్యూటీ కమిషనర్ ఏ.గాయత్రి మాట్లాడుతూ బాల కార్మికులు గణనీయంగా తగ్గిపోయారని, అయినా ప్రతిరోజు బాల కార్మికుల దినోత్సవంగా భావిస్తూ పని చేయాలని సూచించారు. చైల్డ్ రైట్స్ అడ్వకేసీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కె. సమీర్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యకమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్స్, జిల్లా బాలల సంరక్షణ విభాగం సిబ్బంది, జిల్లా కార్మిక శాఖ సిబ్బంది, క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్స్ సిబ్బంది, ప్యానెల్ అడ్వకేట్, పారా లీగల్ వలంటీర్స్ పాల్గొన్నారు.

వీణా విద్వాంసురాలు లక్ష్మీ శ్రీనివాస్‌కు సత్కారం



గుంటూరు వెస్ట్: పట్టణానికి చెందిన ప్రముఖ వీణా విద్వాంసురాలు రామరాజు లక్ష్మీ శ్రీనివాస్, కవి, రచయిత సయ్యద్ జానీ బాషాలను హైదరాబాద్‌లోని జీవీఆర్ ఆరాధన కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ మేరకు డాక్టర్ రామరాజు శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీ శ్రీనివాస్ అనేక వేదికలపై , ప్రముఖ దేవాలయాల్లో వీణా వాదనతో అభిమానులను అలరించారు. ఈ సందర్భంగా ఆమెకు సాంస్కృతిక సంస్థల నిర్వాహకులు జి.మల్లికార్జునరావు, డి.తిరుమలేశ్వరరావు అభినందనలు తెలిపారు.

ముగిసిన వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: స్థానిక లాలాపేటలో గల శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ముగిశాయి. రాత్రి ద్వాదశ ప్రదక్షిణలు, పవళింపు సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమాలను దేవస్థాన ఈవో టి.సుభద్ర పర్యవేక్షించారు.

హనుమంతుడిని యువత ఆదర్శంగా తీసుకోవాలి



నగరంపాలెం: నేటి యువత హనుమంతుడిని ఆదర్శంగా తీసుకోవాలని, తద్వారా యువత విజయం సాధించవచ్చని ప్రవచనకర్త మల్లాది కైలాష్‌నాథ్ అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై గురువారం ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. మల్లాది కైలాష్ నాథ్ ప్రసంగిస్తూ హనుమంతుడు మహా జ్ఞాని వీరుడు అని చెప్పారు. శ్రీరామునికి బంటుగా అతనికి మేలు కలగాలని ఉద్దేశంతో అత్యుత్తమంగా పని చేశాడని తెలిపారు.హనుమంతుడి హృదయపూర్వకమైన భక్తిని అందరం ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు.

అప్పుల బాధతో టైలర్ ఆత్మహత్య

పట్నంబజారు: అనారోగ్య కారణాలతో అప్పులపాలై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూనుగుంట్ల వారి వీధిలో నివాసం ఉండే దుబ్బల సుబ్బారావు (56) లాలాపేటలోని వీఎస్ టైలర్స్‌లో టైలర్‌గా పని చేస్తున్నాడు. భార్య దుబాయిలో పనిచేస్తున్న నేపథ్యంలో షాపులో పని చేసుకుంటూ అక్కడే ఉంటున్నాడు. అనారోగ్య కారణంతో ఆర్థిక ఇబ్బందులు ఎక్కువై అప్పులు చేశాడు. మస్తాపానికి గురై గురువారం షాపులో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమార్తె దివ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ


విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న ఉపాధ్యాయుడు రమేష్ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: వెంగళరావునగర్‌లోని నగరపాలకసంస్థ బాలికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ వీర్ల త్రివేణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. ప్రమీల, గుర్రం లక్ష్మీదేవి, విద్యా కమిటీ సభ్యులు ఆరుమళ్ల చెంచు, పవన్, రుద్రకిశోర్, కట్టా కోటయ్య, ఉపాధ్యాయులు పి. రమేష్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న కానిస్టేబుళ్లు

నగరంపాలెం: మేడికొండూరు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ అనీల్‌కు రెండు వారాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. కుడి కాలుకి గాయమై నగరపాలెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన్ను 2013 బ్యాచ్ కానిస్టేబుళ్లు గురువారం పరామర్శించారు. సేకరించిన రూ.1.20 లక్షలను కానిస్టేబుల్ అనిల్ భార్య సంధ్యకు గురువారం ఆసుపత్రిలో అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు గోపిరెడ్డి, సురేష్, ఆనంద్ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శంకర్ విలాస్ సెంటర్‌లో ఏఐటీయూసీ నాయకుల నిరసన


లక్ష్మీపురం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయరాదని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణ డిమాండ్ చేశారు. శంకర్‌విలాస్ సెంటర్‌లో ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపులో భాగంగా జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్ అధ్యక్షతన గురువారం నేతేలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు అని తెలిపారు. తొలగించిన కాంట్రాక్టు కార్మికుల్ని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేయడం అంటే ఆంధ్ర రాష్ట్రానికి తీరని ద్రోహం చేసినట్లేనని పేర్కొన్నారు. ఏఐటీయూసీ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగార స్థాపన కోసం నాటి యువకులు, ప్రజలు ఉద్యమాలు నిర్వహించారో నేడు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అంతకు రెట్టింపు పోరాటాలు చేయవలసిన ఆవశ్యకత ఉందని పిలుపునిచ్చారు. ఈ పోరాటంలో యువకులు, విద్యార్థులు, మేధావులు, ప్రజలు పెద్దఎత్తున భాగస్వామ్యం అవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, నగర అధ్యక్షులు రావుల అంజిబాబు, ఆటో వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు కూరాకుల రాంప్రసాద్, పలు యూనియన్ , సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో మార్పు తెచ్చిన ప్రధాని మోదీ


మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్, వేదికపై ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి, బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: ప్రధాని నరేంద్ర మోదీ దేశ రాజకీయాల్లో పలు మార్పులు తెచ్చారని ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాలన 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లాలోని డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్స్, చార్టెడ్ అకౌంట్స్, ఉపాధ్యాయులు, లెక్చరర్స్, పారిశ్రామివేత్తలు, వ్యాపారస్తులు, విద్యార్థులు, మేధావుల సమావేశం గురువారం నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని గొట్టిపాటి కల్యాణ మండపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్య కుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రధాని మోదీ 11 సంవత్సరాల సుపరిపాలనపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ప్రారంభించారు. అమ్మ పేరుతో మొక్క నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయాల్లో పలు మార్పు తెచ్చారన్నారు. 'సబ్ కా సాత్-సబ్ కా వికాస్' స్ఫూర్తితో పాలనలో వస్తున్న మార్పును ప్రజానీకం స్పష్టంగా గమనిస్తున్నారని చెప్పారు. దేశ సమగ్ర ప్రగతికి ప్రధాని మోదీ పాలన అంకితమైందని పేర్కొన్నారు. రైతుల కోసం పీఎం కిసాన్, సాయిల్ కార్డ్, కిసాన్ క్రెడిట్ కార్డులు తెచ్చారని చెప్పారు. మహిళల ఆత్మాభిమానం నిలిపేలా 12 కోట్లకు పైగా మరుగుదొడ్లు కట్టించారని తెలిపారు. మన యోగాకు ప్రపంచ ఖ్యాతి తెచ్చేలా కృషి చేశారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి తమనంపూడి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు, మాజీ మంత్రి శనక్కాయల అరుణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి, పార్లమెంటు సంయోజక్ భీమినేని చంద్రశేఖర్, టుబాకో బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి చరక కుమార్ గౌడ్, కో-కన్వీనర్లు మంత్రి సుగుణ, దేసు సత్యనారాయణ, గోవాడ వెంకట కృష్ణారావు, నాయకులు ఈదర శ్రీనివాసరెడ్డి, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, నేరెళ్ల మాధవరావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పైపు లైన్ నిర్మాణ పనులు ప్రారంభం


సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద జరుగుతున్న నూతన పైపులైన్ పనులు

నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ వాటర్ ట్యాంకుల నుంచి హెచ్ఎల్ఆర్(లక్ష్మీపురం) వాటర్ ట్యాంకులకు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్ పనులు సంజీవయ్యనగర్ రైల్వే గేటు వద్ద జరుగుతున్నాయి. గతంలో నెహ్రూనగర్ నుంచి హెచ్ఎల్ఆర్‌కు 800 ఎం.ఎం. డయా పైపులైన్‌పై తాగునీటిని సరఫరా చేసేవారు. పైపులైన్ దశాబ్దాలు తరబడినది కావడంతో తరుచు లీకులు ఏర్పడుతూ తాగునీరు వృథా అయ్యేది. దీనికి ప్రత్యామ్నాయంగా గత ప్రభుత్వ హయాంలో 800 ఎం.ఎం. డయా పైపులైన్‌కు బదులు 900 ఎం.ఎం. డయా పైపులైన్ వేశారు. సంజీవయ్యనగర్ రైల్వే గేటు పరిసర ప్రాంతాల్లో పైపులైన్ వేసేందుకు కొన్ని అంతరాలు రావడంతో ఆ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. ప్రస్తుతం ఆ పనుల్ని పూర్తి చేసేందుకు ఇంజినీరింగ్ అధికారులు కార్యచరణ సిద్ధ చేశారు. మరో వారం రోజుల పాటు ఈ పనులు జరుగుతుంటాయని, వాహనదారులు గమనించి సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

నేడు కూటమి హామీల అమలుపై రాష్ట్రస్థాయి సమావేశం

నెహ్రూనగర్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయిన నేపథ్యంలో విశ్వబ్రాహ్మణులకు నెరవేర్చాల్సిన హామీలపై రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశాన్ని శుక్రవారం దువ్వాడ రైల్వే స్టేషన్‌లో రోడ్డు కూర్మన్నపాలెంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పావులూరి హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. స్వర్ణకారులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు, దేవస్థానాలలో మంగళసూత్రాలు, ఆభరణాల తయారీ హక్కుల్ని స్వర్ణకారులకు మాత్రమే ఇవ్వాలని, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి దాన్ని పరిశ్రమల శాఖ బదిలీ చేసి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా ప్రత్యేక నిధులు కేటాయింపుతో పాటు పలు అంశాలపై రాష్ట్ర స్థాయి సమావేశం జరుగుతుందని తెలిపారు.

వాచ్‌మేన్‌పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నెహ్రూనగర్: విద్యానగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మేన్‌గా పని చేస్తున్న ఈశ్వరరావుపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆయన గురువారం వాచ్‌మేన్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం రాత్రి ఈశ్వరరావు రూము ఎదురుగా అపార్ట్‌మెంట్‌లోని ఓ ఫ్లాట్ ఓనర్ కారు డ్రైవర్ మద్యం తాగుతుండటాన్ని ప్రశ్నించినందుకు దాడి చేసి గాయపరిచడం బాధాకరమని తెలిపారు. దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అనూష మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

నెహ్రూనగర్: రజక మహిళ తోరటి అనూష మరణానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ రజక వృత్తి ధోబీ ఘాట్ల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని ఆర్టీసీ కాలనీ వద్ద గురువారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షులు చెన్నూరి చెన్నయ్య మాట్లాడుతూ అనూష మరణానికి కారణమైన ఆమె భర్త, అతనికి సహకరించిన వారిపై హత్యా నేరంపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని మే 25న కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌లో వినతి పత్రం అందజేశామని తెలిపారు. సదరు ఫిర్యాదును పరిశీలించాలని డీఎంహెచ్‌ఓకు కలెక్టర్ సిఫార్సు చేశారన్నారు. మే 29న సమస్యను పరిష్కరించనట్లు ఆన్‌లైన్‌లో నమోదు చేశారని, బాధిత మహిళకు న్యాయం జరిగే వరకు నిరాహార దీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సమితి జిల్లా గంజరపల్లి వీరాంజనేయులు, వడ్డెర సంఘం నాయకులు ఉప్పుతాళ్ల శ్రీనివాసరావు, కొండూరు శివ, సత్తెనపల్లి రాంబాబు, బాబు పాల్గొన్నారు.

అయ్యప్ప వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



నగరంపాలెం: స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీ విఘ్నేశ్వరస్వామి సహిత శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి, శ్రీ విద్యా సరస్వతి, పర్వత వర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎంకేఆర్ అయ్యప్పస్వామి ఫౌండేషన్ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో ఉదయం మంగళ వాయిద్యాలతో గోపూజ, గురు ప్రార్థన, గణపతి పూజ, గణపతి ఉపనిషత్ పారాయణ, నవగ్రహ, యోగిని, వాస్తు పూజలు నిర్వహించారు. ఆలయ పూజారులు శివకుమారశర్మ, చంద్రశేఖరశర్మ వేద మంత్రాల నడుమ భక్తి శ్రద్ధలతో పూజలు చేపట్టారు. సాయంత్రం గణపతి హోమం నిర్వహించారు. కార్యక్రమాలను అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి, కొండారెడ్డి పర్యవేక్షించారు.

నగరాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

కమిషనర్ పులి శ్రీనివాసులు


అధికారులతో సమావేశమైన కమిషనర్

నెహ్రూనగర్: నగరాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దడానికి, ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని మిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఒక్కో వార్డ్‌ను శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కి అప్పగిస్తున్నామని చెప్పారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగ అధికారులతో ట్రేడ్ లైసెన్స్‌లు, పారిశుద్ధ్య పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డ్ సచివాలయ శానిటేషన్ కార్యదర్శుల ద్వారా ఇళ్ల సంఖ్యను తీసుకొని, ఈ నెల 15 నుంచి కార్యక్రమాలు అమలు జరిగేలా ఉత్తర్వులు ఇస్తామని తెలిపారు. త్వరలో ఇంటింటికీ స్కానర్‌లు ఏర్పాటు చేసి, కమాండ్ కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేస్తామని చెప్పారు. తద్వారా ఏ ప్రాంతంలో చెత్త సేకరణ జరగలేదో తెలుస్తుందని వివరించారు. మలేరియా కార్మికులు కూడా ఇక నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్ల పరిధిలోనే పని చేస్తారని తెలిపారు. నగరంలోని కమర్షియల్ సంస్థలు తప్పనిసరిగా సంస్థ ఏర్పాటు చేసిన నాటి నుంచే ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని స్పష్టం చేశారు. జనన,మరణ ధ్రువపత్రాల నమోదులో ఇన్‌స్పెక్టర్లపై పలు ఫిర్యాదులు అందుతున్నాయని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. సమావేశంలో సీఎంఓహెచ్ఓ డాక్టర్ పీజే అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, బయాలజిస్ట్ రామారావు, శానిటరీ సూపర్వైజర్లు ఆయాబ్ ఖాన్, సోమశేఖర్, ప్రసాద్, ప్రజారోగ్య విభాగ సూపరింటెండెంట్ పోలేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

డ్రెయిన్స్‌పై గ్రిల్స్ ఏర్పాటు చేయాలి

నగరపాలక సంస్థ పరిధిలోని మేజర్ అవుట్ ఫాల్ డ్రెయిన్స్‌పై ఉన్న కల్వర్టుల వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేసి, వ్యర్థాలను ఎక్కడికక్కడ అడ్డుకొని తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ పండరీపురం, కృష్ణా నగర్, బ్రాడీపేట, విద్యా నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వార్డ్ సచివాలయాల పరిధిలో పారిశుద్ధ్యం పక్కాగా ఉండేలా శానిటేషన్ కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లు బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. పర్యటనలో ఏసీపీ రెహ్మాన్, డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ ఎన్వీఎస్ ప్రసాద్, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు పెమ్మసాని అభినందనలు


చిన్నారులను అభినందిస్తున్న పెమ్మసాని

గుంటూరు వెస్ట్ (క్రీడలు): చిన్నారులు క్రీడలను ప్రొఫెషనల్‌గా భావించి అందులో అత్యుత్తములుగా నిలిస్తే రాష్ట్రానికి, దేశానికి పేరుతో పాటు ఉపాధి మార్గాలు కూడా లభిస్తాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. తమిళనాడులోని కోయంబత్తూర్‌లో గత నెల 24 నుంచి 26 వరకు జరిగిన 5వ అంతర్జాతీయ కర్రసాము పోటీల్లో గుంటూరుకు చెందిన కాశీనాథ్ కర్రసాములో, మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు మొత్తం 17 పతకాలు గెలుపొందారు. పెమ్మసాని గురువారం తన కార్యాలయంలో వారిని అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజానికి చిన్నారుల దేహదారుఢ్యం ఎంతో కీలకమని తెలిపారు. ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం లేకపోతే ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు చిన్నారులను క్రీడల వైపు ప్రోత్సహించాలని ఆయన సూచించారు. అకాడమీ చీఫ్ కోచ్ కాశీనాథ్‌రెడ్డిని పెమ్మసాని అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నట్లు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ. నసీర్ అహ్మద్ తెలిపారు. రైలుపేటలోని గొలుసు నాంచారమ్మ, కొండలరావు నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థినులకు విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ తూర్పు నియోజకవర్గంలోని 90 ప్రభుత్వ పాఠశాలల్లో 11,500 మందికి రూ.మూడు కోట్ల విలువైన కిట్లను అందించమని తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని 10వేల మంది విద్యార్థులకు అందిస్తున్నామని చెప్పారు.